కథానికలు :

గుణసంధి

శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రి

ఋ-ణా-బంధం.. అని, బిగ్గరగా పణుక్కుంటున్నట్లు గొణుగుతున్నాడు...నేస్తం.

ఆ ఊరివాడిని కొబట్టి, అభిమానంకొద్దీ... 'కృష్ణాపత్రిక సారస్వతానుబంధం' అని నేను కల గంటున్నట్లు అర్థంచేసుకున్నాను.

'కాదోయీ...ఋణానుబంధం...' ఇదీ వాడి, సొద.

'ఎక్కడో-ఏకడనో, పల్లెలో పుట్టి-పెరిగిన బందరులో, పద్దుర్రానీ కొనుక్కున్న ఉత్తరీయం, అలహాబాదులో ఆచలిలో గజగజలాడే ముసలిబడుగుఅవస్థకు గుండె కరగి.. రైలు కదులుతూండగా అలా కిటికీలోంచి గిరవాటు వేశాను...ఎక్కడికెక్కడో చూశావా... యింతకూ అది వాడికి ప్రాప్తం...'

ఇత్యాదయః...

అవున-భాయీ-గా తల ఊగించుతూ, దానబ్బగా, నాకథ అల్లాను.

"దోవవెంట పోతూవుంటే...కానీ దొరికింది. కానీ దొరికితే, కలిసివస్తుందని నానుడి. కానీ చూద్దాం.. .. పార్కు మలుపులో కానీ-కానీ లాటరీ పరుచుకు కూర్చుంటే, బిల్లేరీ అద్దంమీద దాన్ని కొనాను కాచి-కాచి, కలకాలం ఉసూరుమనేట్టు, అర్ధరూపాయి, వాడిదగ్గర ధ్వోచ్చాను.

(చెప్పడం మరిచిపోయినట్లున్నాను-యిందాకటినుంచీ; ఇదంతా జరుగుతూన్నది...ఎక్కడో కాదు, మన బెజవాడలో.)

అప్పటికి రెండున్నర అయింది. మధ్యాహ్నం. ఆదివారం పగలుసినిమాకు ఆ కాస్త ఖర్చు పెట్టేస్తే...ఆ దోషం అంతటితో తీరిపోతుం దనుకున్నాను

కాఫీ-గీఫీ. కొసిని సిగరెట్లూ.. అనుకో నిచ్చే తరగతికి డబ్బులు మిగుల్చుకుంటే చాలు.

.. త్రోవలో ఆడుతూ-పాడుతూ నేను అక్కడికి చేరుకునే టప్పటికే. ఆట మొదలు పెట్టారు.

ఆవాళా యింకా, విప్రనారాయణే! అదివరకు దాన్ని కచ్చా-పచ్చాగా అయిదారుసార్లు, సగం-సగం చూశాను. అరవచింతామణేమో కదా అనుకొని పరుగెత్తాను సుమా...తారీఖు తడిసి సినలుగా కనబడటం లేదు. (అది రేపటినుంచి)- అన్నాడు, కిన్నంఅవతలవాడు.

ఇవతల నేనుతప్ప ఇంకో పిట్ట మిగల లేదు. యింతలో, వాన తగులుకున్నది.

ఆడవాళ్ల గేటుమీద అర్చితప్ప.. ఆ బారు-కారునా, ఎక్కడా ఆచ్ఛాదనలేదు.. అక్కడే నక్కాను.

నాపక్కను, ఓకుర్రవాడు, చిరుగులబనీనంతా తడిసి ముద్దై, తలుపురెక్క నానుకొని యీడురుకు గజ-గజలాడుతున్నాడు.

గేటులో ఉండే రక మేమో అనుకున్నాన. కాదన్నాడు చేగోడీలబాపతేమో అనుకున్నాన; ఉహుఁ అన్నాడు. అన్నా, వాళ్లూ అందరూ ముందు లోపలికి వెళ్లిపోతే, తాను ఒక్కడూ వెనుకపడి మిగిలిపోయినా నన్నాడు. ఎల్లా లోపలికి పోవడం? డబ్బులు వాళ్ల దగ్గర ఉన్నాయి.. టిక్కెట్టు లేనిదీ గేటుదగ్గర, లోపలికి పోనీయరు. ఎల్లా లోపలికి వెళ్లడం?...

అవును పాపం, టిక్కెట్టు లేకుండా లోపలికి పోలేడు..

ఆ కాసిని డబ్బులూ పెట్టి టిక్కెట్టు కొని, అది వాడి చేతులో పెట్టి, ఉడాయించమన్నాను. అంత వానలోనూ తడుస్తూ నేను యింటికి వచ్చాను...

చూడు...ఎక్కడి కెక్కడో!...

ఎవరో పసివాడో, పెద్దవాడో... పారేసుకున్న, కానీ...

ఎందరి కాళ్లో దులిపి...వాకు కట్టబెట్టాడు, లాటరీవాడు.

నేను అది మూట కట్టుకుని కాళ్ళీడ్చుకుంటూ వెళ్లి... హస్తార్పితంగా అందులో కొంత...ఆ పసివాడి పరంగా దరిసించాను. ఎక్కడి కెక్కడో!...

—'ఆ కుర్రవాడి మాటలన్నీ నిజమని నమ్మావ్?'

'లేదోయ్.. అవన్నీ అబద్ధాలని వాడి మొఖమే అంటూంది'

'అయితే, మరి...

.. వాడు అనుకోని పని మనం చేస్తే... ఆ హాయికి ఖరీదు లేద...

.. 'వానలో తడవకపోతే, ఇలిసేదాకా ఆగితే ఏం మించుకు పోయిందో.. ?'- అంతా విన్న తరువాత యీ సందేహం రాకతప్పదు.

'ఏమో, అప్పుడలా తోచిందికాదు.'

'అవునులే. అంతటి ఘనకార్యం చేసినప్పుడు ఆమాత్రక ఆవేశం... అపాటి ఒళ్లు తెలియకపోవడం లేకపోతే, ఎల్లా? ఆ హుషారులో.. ఆ కాశం మీద నడిచావను కుంటాను!... ఏం?'

ఉహూఁ... అడుగుతీసి అడుగు వేయలేక' పోయినాన అందుకే తడిసి ముప్పందు మైంది!

'ఎందుచేతనో?..'

'అఁ. ముక్తసరిగా టిక్కెట్టు మాత్రమే కొని యిచ్చాను కాని... పైనో అర్ధణా అణా కొనుక్కుతినమని యిచ్చేపాటి తెలివీ, తెగువా లేక పోయింది కదా... యీ ఆలోచన పోయేప్పటి కల్లా, నామీద నాకే ఎంత అసహ్యం వేసిం దనుకున్నావ్!'

'పోనులే పాపం... నీ ఔదార్యం ఎవరెరుగలు? కాని...నీజేబు ఆతరుణంలో పూర్తిగా ఖాళీ అన్న సంగతి నీకు గుర్తులేక పోయినా. మేము గ్రహించుకోగలము..'

'ఛస్... నీవిషపు ఆలోచనతో కథ కాస్తా చెడిపోయింది..'

'కాదోయ్.. ఇది కథే అయితే ఓ కొలిక్కి వచ్చి పకడ్‌గా రక్తికట్టింది...'

(సాగదీసిన కొద్దీ ..బిగిసి పీటముడి పడుతుంది... ఇద్దరమూ కథల కామరాజులమే...)

—

రాజవజ్రం

రచన · స్టీవెన్సన్ అనువాదం. 'సుధ'

తను ఒంటరిగా వున్నపుడు పోయే పెరటి గుమ్మాన వెళ్లబోతున్నాడు మహారాజా.

'మహారాజుగారి దర్శనార్థం వేచియున్నా' అంటూ క్రీనీడలోనుంచి ఎదరకు వచ్చి నమస్కరించి నిలుచున్నాడు, ఓ వ్యక్తి.

'జ్ఞాను-నేనే. ఏం గావాలి?'

'నేను డిటెక్టివును.మా అధికారిదగ్గరనుంచి తమకు ఈ ఉత్తరువు తీసుకొచ్చాను.' కాగితం ఇచ్చాడు.

మహారాజు వీథి దీపపు వెలుతురులో విప్పి చూశాడు తనను వెంటనే డిటెక్టివువెంట కచేరికి రావలసినదిగా కోరబడివుంది!

'ఇంతకూ, నేను అరెస్టు చేయబడ్డాను!'

'తమను దయచేయమనడంలో మా అధికారికి మరో వుద్దేశ్యం ఏమీ లేదని నేను చెప్పగలను. వారంటు జారీ చేయబడలేదని గ్రహించగలరు. ఉద్యోగరీత్యా—మిమ్మల రప్పించడం తప్పనిసరైనందున—అలా చేయవలసివచ్చింది.' అన్నాడు, డిటెక్టివు.

'అయితే, నే నిప్పుడు నీకూడా రావడానికి తిరస్కరిస్తే?'

'తమ దగ్గిర దాచనవసరంలేదు. తమను తీసుకెళ్ళడానికి కావలసిన అధికారం నాకీయ బడింది.' వినయపూర్వకంగా చెప్పాడు, డిటెక్టివు.

'మీ దౌర్జన్యం నాకు ఆశ్చర్యం కలిగిస్తున్నది! సామాన్యజవానవుగనుక నిన్ననవలసినదేమీ లేదు. కాని, నీపై అధికారుల దుష్ప్రవర్తన ఖండించవలసి ఉంద. ఇటువంటి అననుసరణీయమైన దుష్కరచర్యకు కారణం నీవు ఊహించగలవా? నే నిప్పటికింకా సమ్మతించడంగాని, తిరస్కరించడంగాని జరుగలేదు. అంతా నీవు చెప్పబోయే సమాధానపు విజ్ఞతనుబట్టి ఉంటుంది. మరోసారి జ్ఞప్తికి తెస్తున్నా—ఇది చాలా విషమవిషయం.' కొంచెం గట్టిగా మాట్లాడేడు, మహారాజు.

'రాయబహదూర్, అతని తమ్ముడూ, తమ మీద నమ్మరాని చోరత్వ మాపాదించారు. ప్రఖ్యాత 'రాజవజ్రం' తమవద్దనున్నదని నేరారోపణ చేశారు. తమ కేం తెలియదని ఒక్క మాట శెలవిస్తే చాలు—మా అధికారికి సరిపోతుంది. అంతేకాదు; తమరు దయతో—ఈ విషయం తమకేం తెలియదని—నాతో చెప్పినా చాలు, నేను శెలవుతీసుకుని వెళ్లిపోతా.' వినీద పర్చేడు, డిటెక్టివు.

ఇంతవరకూ ఇదంతా సామాన్యవిషయంగానే భావిస్తూ వేరే ఆలోచనలో వున్నాడు, మహారాజు. రాయబహదూర్ పేరు అతని హృదయాన్ని కదిలించి, నిజం తెలియవచ్చింది. తను అరెస్టు చేయబడడమేకాదు—నేరస్థుడు కూడా! ఇప్పుడు తనేమని చెప్పాలి-ఏం చేయాలి? ఆ 'రాజవజ్రం' నిజంగా ఒక మహాశాపం! దాని దుష్ప్రభల్యాని కితనే కడపటి 'బలి' అనుకున్నాడు నిజానికి, డిటెక్టివు అడిగినట్టు తన కేమీ తెలియదని చెప్పలేదు. కొంత వ్యవధి లభ్యం కావాలి. సందిగ్ధావస్థలో......'సరే, కానీయ్. కచేరికి నడుద్దాం, పద' అన్నాడు.

డిటెక్టివు నమస్కరించి సగౌరవంగా మహారాజుకు దారిచూపుతూ ముందు నడుస్తున్నాడు.

'దగ్గిరగా నడవయ్యా, సరదాగా మాట్లాడుకుంటూపోదాం. నేను పొరపడడం లేదనుకుంటా—ఇదే నిన్ను మొదటిసారిగా చూడడం కాదు—' పలుకరించేడు.

'తమరు నన్ను గుర్తుపట్టడం ఎంతో గౌరవంగా భావిస్తున్నా. ఎప్పుడో ఎనిమిది సంవత్సరాలక్రితం తమ దర్శనం చేసుకున్నాను.' సంతోషం వెలిబుచ్చాడు, డిటెక్టివు.

'ముఖాలు గుర్తించుకోవడం—ఉద్యోగరీత్యా—నీ కెంతవసరమో, నాకూ అంతే. నీకూ నాకూ కూడ న్యాయరక్షణే కర్తవ్యం. ఎటొచ్చీ నాది మంచి లబ్ధిలో కూడినదీ; నీది అపాయకరమైనదిన్నీ. మంచి మనిషి మనిద్దరినీ ఒకేలా గౌరవిస్తాడు. నీ కాశ్చర్యం కలిగించవచ్చు—అనామకుడై దుర్బలరాజరికం చేసేకన్న, కర్తవ్యం నెరవేర్చుకునే డిటెక్టివుగా వుండడమే మంచిదంటాను.' మహారాజు చెప్తూంటే డిటెక్టివు ఉప్పొంగిపోయాడు.

'తమ ఔదార్యం, లేనిపోని అనుమానంతో తమకు కల్గించిన శ్రమకు ఎంత దయ చూపుతున్నారు!'

'నేను నిన్ను మోసపుచ్చబోవటంలేదని నీకేం తెలుసు?' ప్రశ్నించేడు మహారాజు.

'మోసకం చెయ్యదనుగాకుండ భగవంతుడు రక్షించుగాక!' కోరుకున్నాడు డిటెక్టివు.

'నీ నిశ్చితాన్ని శ్లాఘిస్తున్నా—గౌరవ, విజ్ఞానాలు కల్గిన వ్యక్తి చేసేది. అది. ఈ మహా ప్రపంచం కాంతాకనక సంపుష్టము. అవి పొందబడే గౌరవానికి అంతులేదు. పదిలక్షల రూపాయిలు తృణప్రాయంగా చూసేవ్యక్తి, తన గౌరవాన్ని ఒక రాజ్యంకోసమో, ఒక స్త్రీకోసమో, బలిచేస్తాడు. నా అంతట నేను, మానవ సౌశీల్యాన్ని వంచించేవీ దానికి అతీతమైన దౌర్బల్యం చేకూర్చేవీ, ఎన్నో సంఘటనలు చూశాను. నేనూ భగవంతునిమీద భారంవేసి నీ అడుగుజాడల్లో నడవడానికి సంతసిస్తున్నాను. ఆ సదుద్దేశ్యంవల్లనే మనిద్దరం కలసి ఈ పట్నంలో ఇలా పవిత్రహృదయాలతో నడవగల్గుతున్నాము.' అన్నాడు, మహారాజు.

'ఇదివరకల్లా తమ ధైర్యసాహసాలగురించే విన్నాను. తమలోని శాంతి, విజ్ఞానాలు తెలుసుకోలేదు. సత్యం వచించేరు—హృదయానికి నాటేలా వచించేరు. ఈ ప్రపంచం పరీక్షా ప్రదేశం.' మాట్లాడుతున్నాడు డిటెక్టివు.

"మనం ఇప్పుడు వంతెనమధ్యనున్నాం. నీ మోచేతులు కూడ పిట్టగోడ నానుకుని చూడు. ఆ నీరు మోసుకుపోతున్నట్టే, కామ క్రోధాదులు, జీవితంలోని ఒడుదుడుకులు, దుర్బలుల మానమర్యాదలను మోసుకుపోతవి. ఓ చిన్నకథ చెప్తా విను.'

'చిత్తం' అంటూ డిటెక్టివు, మహారాజు ననుకరిస్తూ, మోచేయానుకుని వింటానికి సిద్ధపడ్డాడు.

పట్నం మాటుమణిగింది. మినుకు మినుకులాడే అసంఖ్యాక నక్షత్ర కాంతిలో మేడలవీ కనుపించకపోతే వారు ఏ మారుమూల నది ఒడ్డుననో ఒంటరిగా ఉన్న ట్లుండేది.

'ఒక ఉద్యోగి,' చెప్తున్నాడు మహారాజు' "ధైర్యవంతుడూ, గుణవంతుడూ—తెలివి తేటల వలన అత్యున్నత పదవినంది, కీర్తి, గౌరవాలు సంపాదించుకున్నాడు—దురదృష్టవశాత్తూ ఒక సంస్థానాధీశుని ఆభరణాలు చూశాడు. వీటిలో ఒక వజ్రం—పరిమాణంలోను, అందంలోనూ, అసాధారణమైనది—అతని కంటబడింది; ఆకర్షించింది. ఆ క్షణంనుంచి అతని జీవితంలో ఒకే ఒక్క కోర్కె—కీర్తి, మర్యాద, స్నేహం, దేశప్రేమ, సర్వం ఆ వజ్రంకోసం బలిచేయడానికి సిద్ధపడ్డాడు. మూడు సంవత్సరాలు ఆ మూఢమహారాజు దగ్గిర సేవచేశాడు—సుభద్రకోసం సన్యాసయిన అర్జునునిలా. ఇతర రాజ్యాల సరిహద్దులు కలిపి, హత్యలు చేయించి, మహారాజుకు ఉచితసలహా చెప్పి ఆగ్రహానికి గురియైన దురదృష్టవంతుడగు తన తోటి అధికారిని నొక్కనిని శిక్షింపచేసి, చివరకు తన మాతృదేశం ప్రమాదస్థితిలో నుండగా వేలకొలది సోదర సైనికులను మోసగించి, శత్రుశక్తికి గురియై చిత్రవధగావింపబడేలా చేశాడు. ఏ మయితేనేం—తన అదృష్టం పండింది. ఆ దుర్వాంఛితమైన వజ్రం ఇంటికి తెచ్చాడు.

'రోజులు గడిచాయి,' చెప్తూన్నాడు మహారాజు: "కర్మవశాత్తూ ఆ వజ్రం అతని చేయి జారింది—ఒక యువకునిచేతిలో పడింది. అతను విద్యార్థి, పురోహితుడు, జీవనపథంలో ఉన్నతమైన స్థానం పొందబోతున్నాడు. అతనికి కూడ ఈ శిన్నగ్రహం దాపరించింది. దైవప్రార్థన, విద్య, సర్వం వదలిపెట్టాడు. ఆ వజ్రం పట్టుకొని విదేశం పోయాడు. ఆ ఉద్యోగికి ఒక తమ్ముడున్నాడు—చిత్తులమారి, ధైర్యవంతుడూ, నీచుడున్నూ. ఈ పురోహితుని రహస్యం తెలుసుకున్నాడు. ఏం చేస్తాడు? అన్నగారితో చెప్తాడా—పోలీసుకు తెలియపరుస్తాడా? లేదు; ఇతన్నికూడ ఆశనిగ్రహం ఆవహించింది—ఆ వజ్రం తనే సంపాదించాలి. హత్య చేయడానికి కూడ సిద్ధమై, ఆ పురోహితునిమీద విషప్రయోగం చేసి, తన ఆకలి తీర్చుకున్నాడు తరువాత—నే చెప్పబోయే నీతికి అంత ముఖ్యం కొని—ఏదోవిధంగా ఆ వజ్రం అతని చేయిజారి, మరో చేతిలో పడింది. అదిచూచి భయభ్రాంతుడై అతను, ఒక అత్యున్నత స్థానంలో వున్న ఒక వ్యక్తి ఆధీనములో వుంచాడు.

'ఆ ఉద్యోగి రాయబహదూర్. ఆ వజ్రమే రాజవజ్రం—నీవు ఇప్పుడు నీ కళ్ళతో చూస్తున్నావు—ఇదిగో!' గుప్పిట విప్పేడు మహారాజు.

'ఆఁ!' డిటెక్టివు ఆశ్చర్యచకితుడై పోయాడు.

'మోసం, అవినీతి గురించి మాట్లాడుకుంటున్నాం' చెప్తున్నాడు మహారాజు, 'ఈ మెరుపుముద్ద నాకు విషక్రిములతో కులకులలాడుతున్నంత అసహ్యం! అమాయకుల రక్తపు గడ్డంత హృదయవిదారకమైనది. నీకు దీని జీవితంలో శతాంశంమాత్రమే చెప్పేను. పూర్వం ఏం జరిగింది, ఎటువంటి దుష్కార్యాలకూ, పాపాలకూ పూర్వులను పురికొల్పిందీ ...అబ్బ! నే నవి తలుచుకుంటే నే భయకంపితుడనై పోతున్నా ఎన్నో సంవత్సరాలు నరకరాజ్యానికి నాణెమై కూర్చుంది. రక్తపాతం! అంతులేని నైచ్యం! విదలితజీవితాలు, స్నేహం.. అన్నీ ఈనీటితో సరి... పాపం శమించుగాక!...దీని దుష్టసామ్రాజ్యానికి ఇదే అంతం...' అంటూ మహారాజు చేయి విసిరేడు. కనులు మిఱుమిట్లు గొల్పుతూ ఆ వజ్రం ప్రవాహంలో...